# వెండి నీరు

పుస్తకం మూసి దిండు కింద పెట్టి లేచి కూర్చున్నాను. కిటికీలోంచి చల్లటి గాలి వీస్తోంది. బల్లమీద ఉన్న గడియారం వంక చూశాను. పదీ పదయింది. మంచం దిగి కిటికీ తలుపులు మూసి గడియ పెట్టి టేబుల్ లైటు ఆర్పి బెడ్ లైట్ వెలిగించాను. డ్రాయింగ్ రూం నుంచి వెలుగు పడకగదిలోకి పొడుగ్గా పడుతోంది. వెలుగు ఎక్కువగా ఉంటే నాకు నిద్ర పట్టదు.

డ్రాయింగ్ రూం తలుపు వరకు వచ్చి తొంగి చూశాను. ఆయన సోఫాలో కూర్చొని టివి చూస్తున్నారు. వీడియో లైబ్రరీ నుండి ఏవో తెచ్చుకుని చూస్తుంటారు. మామూలుగా వచ్చే కార్యక్రమాల మీద ఆయనకు ఆసక్తి లేదు. ఆయనకు బాక్సింగ్ అన్నా బుల్ ఫైటింగ్ అన్నా చాలా ఇష్టం. ఎక్కువగా అటువంటి క్యాసెట్లే తెచ్చుకుంటారు.

మా పెళ్లయి పదిహేను సంవత్సరాలు నిండాయి. పెళ్లయిన రెండో సంవత్సరంలో ఒకబాబు పుట్టి చనిపోయాడు. ఆ తర్వాత నాకు పిల్లలు కలుగలేదు. కలగరని డాక్టర్లు తేల్చి చెప్పేశారు. అనాథాశ్రమం నుండి ఎవరినైనా తెచ్చి పెంచుకుందామని అనుకున్నాము. ఆ అనుకోవటం అనుకోవటంగానే మిగిలిపోయింది.

తలుపు తెరిచి డ్రాయింగ్ రూంలోకి నడిచాను. నా అడుగుల చప్పుడుకు ఆయన నా వంక చూసి తన పక్కనే నన్ను కూర్చోమని సైగ చేసి తిరిగి టివి చూడటంలో నిమగ్నమయ్యారు. సోఫాలో కూర్చున్నాను. ఆయన కుడి చేతిలో విస్కి నిండిన గ్లాసుంది. సెంటరు టేబుల్ మీద సగం ఖాళి అయిన విస్కీ సీసా ఉంది. ఆయన అప్పుడప్పుడు మందు పుచ్చుకుంటారన్న సంగతి చాలా మందికి తెలియదు. పార్టీలకు వెళ్లినా సాఫ్ట్ డ్రింక్‌లతో సరిపుచ్చుకుంటారు. ఆయనకు ఊళ్లో, యూనివర్సిటీలో, క్యాంపస్‌లో మంచి పేరుంది. ఆయన నాణానికి అవతలివైపు నాకంటే రంగనాయకులకు బాగా తెలుసు. విచిత్రమేమిటంటే మా పెళ్లయి ఇన్ని సంవత్సరాలయినా ఆయన మనస్తత్వం నాకు అర్థం కాలేదు. నాకెంతో దగ్గరగా ఉన్నట్టనిపించినా నిజానికి కాదు. నేనాయన గురించి సీరియస్‌గా ఆలోచించటం మానేశాను.

ముందుకు వంగి గ్లాసు సెంటర్ టేబుల్ మీద పెట్టి సిగరెట్ వెలిగించారు. అగ్గిపుల్లను యాష్ ట్రేలో పడేసి నా ముఖంలోకి చూశారు. చెంపలమీద జుట్టు బాగా

నెరసిపోయింది. రంగువేసుకోవటంలేదు. ఎప్పుడూ నీట్‌గా ఉండే మనిషి నెలరోజుల నుండి తనమీద తను మునుపటంత శ్రద్ధ తీసుకోవటంలేదు.

"నిద్రపట్టటంలేదా?" అడిగాడు.

"ఇప్పటివరకు ఏదో నవల చదువుతూ ఉండిపోయాను."

"ఓహో..... నిద్ర పట్టలేదేమో అనుకున్నాను. నిద్ర పట్టకపోవటానికి చాలా కారణాలుంటాయి. మొదటిది ........."

ఆయన ఏమి చెబుతారో నేను ఊహించగలను. చటుక్కున లేచి నిలబడ్డాను.

కుడిచేతిని గాలిలో ఆడిస్తూ "కూర్చో. నేనతని సంగతి ఎత్తను. ప్రేమకు, కామానికి చాలా తేడా ఉంది" అన్నారు.

"ఈ మధ్య మీరు రోజూ తాగుతున్నారు. మీ ఆరోగ్యం గురించి పట్టించుకోవటం లేదు."

"ఏరోజుకారోజు రేపటి నుండి తాగకూడదనుకుంటాను. గట్టిగానే అనుకుంటాను. సాయంత్రం అయ్యేసరికి అన్ని మర్చిపోతుంటాను. నిన్నో మాట అడుగుదామనుకుంటూనే మర్చిపోతున్నాను.... నాలుగయిదు రోజుల ముందట అంతకు ముందు కూడా డ్రస్సింగ్ టేబుల్ డ్రాయర్‌లో నాకు నిద్ర మాత్రలు కనిపించాయి. నిద్ర మాత్రలు వాడుతున్నావా?"

పడక గది వైపు తిరగబోతుంటే, "మాట" అన్నారు.

ఆగాను.

"నాకు కొన్ని ఆశయాలున్నాయి. ఏవో మంచి పనులు చేయాలనుకుంటాను. వాళ్లకు వీళ్లకు చేయూతనిచ్చి పైకి తీసుకురావాలనుకుంటాను......విచిత్రమేమిటంటే నేను ఒకటనుకుంటే మరొకటి జరుగుతోంది......"

ఆయన మాట్లాడుతున్నారు. పడక గదిలోకి వెళ్లి రెండు నిద్ర మాత్రలు వేసుకొని నీళ్లు తాగి మంచంమీద పడుకున్నాను. రంగనాయకులు నాకు తటస్థపడకుండా ఉండవలసింది. రంగనాయకుల్ని మొదటిసారిగా మూడు సంవత్సరాలు కిందట చూశాను. మొదట్లో ఎందుచేతనో నాకు మంచి అభిప్రాయం కలగలేదు. వయసులో నాకంటే ఎడెనిమిది సంవత్సరాలు చిన్న. చామనచాయలో నాఅంత ఎత్తు ఉండేవాడు. పెళ్లి కాలేదు. రాయలసీమ మూలలో ఏదో కాలేజిలో లెక్చరర్‌గా పనిచేస్తూ రీసెర్చ్ చేస్తుండేవాడు. అతనెప్పుడు మాఊరొచ్చినా మా ఇంట్లో ఉండేవాడు.రెండు సంవత్సరాల కిందట రంగనాయకులు మా ఇంటికి వచ్చినప్పుడు ఒక సంఘటన జరిగింది. ఆ రోజు హోలీ. హోలీనాడు మా కేంపస్‌లో కోలాహలంగా ఉంటుంది. ఆ ఉత్సాహంలో పది సంవత్సరాల

వెనక్కి నా వయసు వెళ్లిపోతుంటుంది. స్నేహితురాళ్ల ఇళ్లకు వెళ్లి వాళ్ళకు రంగులు పూసి,పూయించుకుని వాళ్లను కూడగట్టుకుని మిగిలిన వాళ్ల ఇళ్లకు వెళ్లి హంగామా చేసి వచ్చేవాళ్లం. మా ఆయనకు నా హంగామా నచ్చేది కాదు. ఉదయాన్నే యూనివర్సిటీకి వెళ్లి చీకటిపడుతుండగా తిరిగి వచ్చేవారు. ఆరోజు ఉదయం పదింటికి రంగులు తీసుకుని బయల్దేరిన దాన్ని రంగులతో తడిసి ఇంటికి తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంట కావస్తోంది. ఇంట్లోకి రాబోతూ మేడగదివైపు చూశాను. కిటికీకి ఆనుకుని రంగనాయకులు నావైపు చూస్తున్నాడు. నా అచ్ఛాదనాలు వంటికి అతుక్కుపోయి ఉన్నాయి. అతను మునుపు నన్నెప్పుడు అలా చూడలేదు. ఆ చూపులకు సిగ్గుతో చుట్టుకుపోయాను. ఎప్పుడూ లేనిది నా అడుగులు తడబడ్డాయి. తలవంచుకుని త్వరత్వరాగా మా ఇంట్లోకి వెళ్లిపోయాను. సరాసరి స్నానాల గదికి నడిచి అద్దంలో నా ముఖం చూసుకున్నాను. తెల్లటి పెయింటుతో వికృతంగా ఉంది. జుట్టు ఎర్రటి రంగుతో నిండి ఉంది. చీరకుచ్చెళ్లు లాగేసుకోబోతుంటే నా ఆలోచనలు రంగనాయకుల మీదకు మళ్లాయి. స్టోరు గదిలో వెతికితే చిన్న డబ్బాలో కొద్దిగా పెయింట్ కనిపించేసరికి ఉత్సాహం వచ్చింది. ఆ కొద్ది పెయింట్ రెండు చేతులకు రాసుకుని మేడమెట్లు చప్పుడుకాకుండా ఎక్కి తలుపు గుమ్మం ముందు ఆగి లోపలికి తొంగి చూశాను. కిటికీ పక్కనే ఉన్న మంచం మీద బోర్లా పడుకుని ఉన్నాడు. అతని ఒంటిమీద గళ్ల లుంగీ మటుకు ఉంది. వీపు మీద వెంట్రుకలు దట్టంగా ఉన్నాయి.

ఆడుగులో అడుగు వేస్తూ మంచం దగ్గరకు వచ్చాను. నా గుండె వేగంగా కొట్టుకోవటం నాకే స్పష్టంగా వినిపిస్తోంది. ఊపిరి బిగపట్టాను. నేను చేయబోయేపని మంచిదని అనుకోవటంలేదు.

"రంగనాయకులూ" పిలిచాను.

అతను వెల్లికిలా తిరిగాడో లేదో ముందుకు వంగి ఆశ్చర్యపోతున్న అతని ముఖానికి పెయింట్ రాయటం మొదలెట్టాను. అతను లేవడానికి ప్రయత్నించాడు.వీలుకానీయలేదు. ముఖం నా చేతులకందకుండా నా చేతులు పట్టుకుని తప్పించుకుందామని విఫల ప్రయత్నం చేశాడు.

అతని చేతులు నా నడుం మీద పడ్డాయి. గట్టిగా పట్టుకున్నా నేనాగలేదు. అతని చేతులు పైకి జరిగి నా గుండెల మీద ఆగాయి. నరాలు జివ్వుమంటుంటే నా చేష్టలుడిగిపోయాయి. నన్ను అతని మీదకు లాక్కున్నాడు. అతను వదిలే ఊపిరివేగంగా నా ముఖానికి తగులుతోంది. ఈ సంఘటన నేను ఊహించలేదు. నా గొంతు పూడుకుపోయినట్లు ఒక్క మాట బయటకురావటం లేదు. నా పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడు. ఒక్కటితో ఆగలేదు.

అతని కౌగిలి మెల్లగా విడిపించుకుని, మంచం దిగాను. పైట అందుకుని భుజాల నిండా కప్పుకుంటూ అతని ముఖంలోకి చూడలేదు. అతను పిలుస్తున్నా వినిపించుకోకుండా బయటకొచ్చాను.

మెట్లు దిగి స్నానాల గదిలోకి వచ్చి తలుపువేసి గడియపెట్టాను. నా గుండె ఇంకా వేగంగా కొట్టుకుంటోంది. ఒక్కో ఉడుపు తీసి బక్కెట్‌లో వేసి కొబ్బరినూనె సీసా అందుకొని రెండు చేతులకూ, ముఖానికి అద్దంలో చూసుకుంటూ రాసుకుంటుంటే అతనే గుర్తు రాసాగాడు. రంగు పూర్తిగా పోవటంలేదు. స్నానానికి ఉపక్రమించేంతలో గది తలుపు మీద ఎవరో తట్టిన చప్పుడయింది. పొరపాటున విన్నానేమోననిపించి. కుళాయి కట్టివేశాను. నా గుండె లిప్తకాలంపాటు కొట్టుకోవటం ఆగింది. “ఎవరు?” నా గొంతు నాకే కొత్తగా వినిపించింది.

జవాబు లేదు. కుళ్లాయి మళ్లీ తిప్పే లోపల తలుపు తట్టిన చప్పుడు వినిపించింది తువ్వాలుతో నన్ను కప్పుకుని తలుపు దగ్గరకు వచ్చి నిలబడ్డాను. తలుపుకు అవతల ఎవరు ఉన్నదీ నేనూహించగలను. తీయటమా వద్దా? కొద్దిసేపు అలా నిలబడి నెమ్మదిగా గడియ తీశాను. తలుపు నెట్టుకుంటూ రంగనాయకులు వచ్చి నన్ను తన చేతుల్లో తీసుకుంటుంటే అడ్డగించ లేకపోయాను.

అది మొదలు .

నెల రోజుల కిందట రంగనాయకుల రీసెర్చ్ పని పూర్తయింది. పేపర్లేవో తయారు చేసుకుంటున్నాడు. అతను ఆమరుసటి రోజు వాళ్ల ఊరు వెళ్లిపోతాడనగా ఉదయం ఏడు గంటలప్పుడు రంగనాయకులు కిందకు వచ్చాడు. అప్పుడు నేను వంట గదిలో ఉన్నాను. ఆయన ఇంట్లో లేరు.మార్నింగ్ వాక్‌కి వెళ్లారు. పని మనిషి పాలు తీసుకురావటానికి వెళ్లింది. రెండు రోజుల కిందట నేను కుట్టించి ఇచ్చిన తెల్ల గీతల నల్లటి చొక్కా గోధుమరంగు పేంటూ వేసుకుని ఉన్నాడు. ఆ డ్రస్‌లో ఎంతో బావున్నట్టనిపించింది.

“ఇంత ఉదయాన్నే కొత్త పెళ్లి కొడుకులా తయారయ్యావు. ఏమిటి విశేషం?” నవ్వుతూ అడిగాను.

“వెళ్లిపోతున్నాను.” అన్నాడు రంగనాయకులు. అతని ముఖం సంతోషంగా లేదు.

“రేపు కదా నువ్వు వెళ్లేది?”

జవాబు చెప్పలేదు.

“కార్యక్రమం ఇంత హఠాత్తుగా ఎందుకు మారిపోయింది?”

"మనసు మార్చుకున్నాను."

"మంచిదే."

"ఇక్కడకు మళ్లీ రాకూడదని నిశ్చయించుకున్నాను".

"సంతోషం. ఇక్కడికంటే వంట గదిలోకా?" అని నవ్వాను.

"కాదు. ఈ ఊరికి, మీ ఇంటికి."

"నీ రీసెర్చ్ పూర్తి అయింది కదా, ఎందుకు వస్తావు? రాకు."

కొద్దిసేపు మౌనంగా ఉండి, "నేను వెళ్లిపోతే నన్ను మర్చిపోతావా?" జాలిగా అడిగాడు.

"తప్పకుండా."

దీర్ఘంగా నిట్టూర్చి, "నాకు కాఫీ కావాలి" అన్నాడు.

"పాలకోసం పనిమనిషి వెళ్లింది. తీసుకొని వస్తుండాలి. అయిదు నిమిషాలాగు. లేదూ బ్లాక్ కాఫీ కావాలంటే ఇప్పుడిప్పుడు చేసిస్తాను."

"బ్లాక్ కాఫీ వద్దు. పది నిమిషాలాగి వస్తాను."

అని తలుపు దగ్గరకు వెళ్లి ఆగి "నీ జుట్టుకున్న రిబ్బను కావాలి" అన్నాడు.

"ఎందుకు?"

"ఎర్రటి రిబ్బనంటే నాకు చాలా ఇష్టం."

"తీసుకో."

తీసుకుని వెళ్లిపోయిన కొద్ది సేపటికి పని మనిషి పాలు తీసుకువచ్చింది. కాఫీ తయారుచేసి ఫ్లాస్కులో పోసి అతను కిందకు వస్తాడని ఎదురు చూశాను. పావుగంటయినా అతను రాలేదు. బ్రేక్ ఫాస్టు చేయటంలో మునిగిపోయాను. పూర్తి చేసే సరికి అరగంట పైగానే పట్టింది. ఆయన మార్నింగ్‌వాక్ నుండి తిరిగిరాలేదు. ఎప్పుడూ లేనిది ఆ వేళ ఆలస్యం అయింది. కాఫీ కోసం రంగనాయకులు కూడా రాలేదు.

మరోపావుగంట చూసి ఫ్లాస్కు తీసుకుని మేడ మీదకు వచ్చాను. గది తలుపు దగ్గరగా వేసి ఉంది. పై మెట్టుమీద నిలబడి కుడిచేత్తే తలుపు నెట్టాను. తలుపు తెరుచుకుంది. లోపలికి నడిచి ఫ్లాస్కు బల్లమీద పెట్టాను. బల్లమీద ఆయన ఫోటో ఉంది. చటుక్కున వెనక్కి తిరిగాను. నా గుండె ఝుల్లుమంది.

రంగనాయకులు ఫ్యాన్‌కు వేలాడుతున్నాడు. కళ్లు తెరుచుకొని ఉన్నాయి. పళ్ళ మధ్యనుండి నాలుక కొద్దిగా బయటకు వచ్చి ఉంది. ఎంతపని చేశాడు? పిచ్చిగా అరుస్తూ కిందకు పరిగెత్తుకుంటూ వచ్చి డ్రాయింగ్ రూంలో కుప్పలా కూలిపోయాను.

* * *

గోడ గడియారం గంటలు కొడుతుంటే పడుతున్న నిద్ర చెదిరిపోయింది. లేచి కూర్చున్నాను. పన్నెండయింది. పక్క మంచం వైపు చూశాను. ఖాళీగా ఉంది. ఆయన పడుకోటానికి రాలేదు. డ్రాయింగ్ రూంలో లైట్ వెలుగుతోంది. మంచం దిగి డ్రాయింగ్‌రూంలోకి నడిచాను. ఆయన సోఫాలోనే కూర్చొని గురక పెడుతున్నారు. గుండె మీద పుస్తకం ఉంది. గదిలో ఫేన్ తిరుగుతోంది. టివి నడుస్తోంది.

ఫేన్ ఆఫ్‌చేసి టివి వైపు చూశాను. బుల్ ఫైటింగ్‌జరుగుతోంది. అలసిపోయిన నల్లటి ఎద్దు కిందపడిపోయింది. ఎద్దులో పొడుగాటి కత్తులు దింపుతున్నారు. రక్తం ధారగా కారుతోంది. ఎద్దు బాధతో తల అటూఇటూ ఆడిస్తోంది.

హోలీనాటి దృశ్యం మనసులో కదలటం మొదలెట్టింది. రంగనాయకుల ముఖానికి పెయింట్ పూస్తున్నాను. అతను లేవటానికి ప్రయత్నిస్తున్నాడు. నేను వీలు కానీయటం లేదు. అతని ముఖం రంగుతో ఎరుపవుతోంది.

ఎద్దు చచ్చిపోయింది. స్టేడియం చప్పట్లతో, ఈలలతో మారుమోగిపోతోంది. ఎద్దు రక్తంకారి నేలమీద గడ్డ కడుతోంది. ఇహ ఆ దృశ్యాన్ని చూడబుద్ధికాలేదు. టి.వి. ఆర్పి ఆయన దగ్గరకు వచ్చాను. పుస్తకం మీద ఉన్న ఆయన చేతులు మెల్లగా తొలగించి పుస్తకం అందుకొని మూయబోతూ ఆగాను. పుస్తకం మధ్యలో నా ఎర్రటి రిబ్బను ఉంది.

◆ ఉదయం వీక్లీ 16 జులై 1987